**తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి 1988 ఉగాది మినీ కథల పోటీలో రు. 150 లు గెలుపొందిన కథ**




"ఒరేయ్ బాబీ ఆఖరు సారి అడుగుతున్నాను వస్తావా? రావా" మధ్య వరకూ అల్లిన జడను విసురుగా వెనక్కు వేసుకుంటూ అడిగింది మృదుల కోపంగా. చురుగ్గా ఝుళిపించిన కొరడాలా మెలికలు తిరుగుతూ వెనక్కు వెళ్ళి పడింది నల్ల త్రాచులాంటి ఆమె జడ. బాబీ మాత్రం ఆమె కోపం తనకు పట్టనట్టు తాపీగా షూ బిగించుకొంటూ "నేనూ ఆఖరు సారే చెబుతున్నారు. ఇవాళ నాకు మ్యాచ్ ఉందనీ, నేను రాననీ" అని మళ్ళీ తనే "అయినా అక్కా బి.ఇడి. టీచరువు కాబోతున్నావు. డిగ్రీ చదివావు. ఆ మాత్రం తోడు లేకుండా వెళ్ళి గెజిటెడ్ చేత అప్లికేషన్ మీద సంతకం చేయించుకురాలేవటే" దీర్ఘం తీస్తూ అన్నాడు. అని "అమ్మా నే గ్రౌండుకు పోతున్నా" అని ఓ కేక పెట్టి బ్యాట్ ఊపుకుంటూ వెళ్ళిపోయాడు.

ఉక్రోషం ఎగసుకు వచ్చింది మృదులకు. గబ గబా తయారై "అమ్మా నేను అప్లికేషన్ పోస్టు చేయడానికి వెడుతున్నా" అంటూ బయలు దేరింది మృదుల. "అదేవిటే ఒక్కదానివే వెడుతున్నావా?" అంటూ బయటకు వచ్చింది మృదుల అమ్మగారు. "ఏం వెళ్ళలేనా?" అని ఎదురు ప్రశ్న వేసి "ఏమైనా ఈ వేళ అప్లికేషన్ పోస్ట్ చేయందే ఇంటికి రాను" అంటూ గబ గబా బయటకు నడిచింది మృదుల.

ముందుగా కాలేజీ ప్రిన్సిపాల్ గారి వద్దకు బయలు దేరింది. కానీ కాలేజి కుర్రవాళ్ళు కొట్టుకోవడం వలన కాలేజీ మూసివేశారట. వారం దాకా తెరవరట, వెంటనే వెనుతిరిగి గవర్నమెంటు హాస్పిటల్‌కు బయలు దేరింది. కానీ పెద్ద డాక్టరుగారు లీవ్‌లో వున్నారు. డాక్టరమ్మ గార్ని పోస్ట్ చేసి నెల దాటినా ఇంతవరకూ జాయిన్ కాలేదు. ఉసూరుమంటూ బయట పడింది మృదుల. ఈ రోజు కూడా అప్లికేషన్ మీద సైన్ చేయించ లేకపోయానని తెలిస్తే "అమ్మో బాబీ తెగ వెక్కిరించేస్తాడు" అనుకుంటూ పట్టుదలగా ఊరి చివరగా వున్న మరో ఆఫీసు వైపు బయలుదేరింది. సమయం మూడు. అయ్యగారు ఉన్నారా అడిగింది తాపీగా చుట్టకాలుస్తున్న అటెండర్ని. "వచ్చేసైమయ్యింది" అని తిరిగి ధూమపానానందంలో మునిగిపోయాడు ఆ అటెండర్.

అవసరం తనది కాబట్టి పైకి ఏమీ అనలేక సదరు ఆఫీసరు గారి పంఖ్యు వారికే మనసులోనే జోహార్లర్పిస్తూ అక్కడి బల్లపై కూలబడింది మృదుల. మూడున్నర అవుతుండగా వచ్చారు అయ్యగారు. మృదుల వైపు ఓరగా మాస్తూ లోపలికి వెళ్ళారు. ఆయన వెనుకనే లోపలికి వెళ్ళిన అటెండర్ బయటకు వచ్చి ఆయన కోసం కూర్చున్న రైతులను లోనికి పంపి "మీరు దేనికి వచ్చారు పాపా" అన్నాడు వెకిలిగా నవ్వుతూ. "అప్లికేషన్ మీద సంతకం చేయించుకోవడానికి" ముక్తసరిగా అంది మృదుల.

చిన్నముల్లు ఒపిగ్గా ప్రయాణం చేసి ఒక గంటను మింగేసింది. కొంత సేపటికి చెమటలు తుడుచుకుంటూ బయటకు వచ్చారు లోపలికి వెళ్ళిన వాళ్ళు. వాళ్ళు వెళ్ళాక అటెండరు అయ్యగారి బెల్లు మోత విని పది నిమిషాల తరువాత బయటకు వచ్చాడు ముసి ముసిగా నవ్వుకుంటూ. అతని తెల్ల చొక్కా జేబులో కొత్తగా వచ్చిన పచ్చ నోటు బయటకు తొంగి మాస్తోంది.

"కాఫీ తాగుతారా పాపా" అడిగాడు పళ్ళికిలిస్తూ.

అక్కర్లేదు. సంతకం చేయిస్తే వెళ్ళి పోతాను. అంది సహనంగా. అతను పాపా అన్నతీరుకు ఒళ్ళు మండుతున్నా.

"సరే అయ్యగారు రమ్మంటున్నారు వెళ్ళండి" అన్నాడు.

ఉస్సురంటూ లేచి తలుపు తోసుకుని లోపలికి వెళ్ళింది. లోపల అయ్యగారు సోఫాలో కాళ్ళార జాపుకొని సిగరెట్ త్రాగుతూ కళ్ళు మూసుకొని వున్నారు.

మృదుల, వచ్చిన శబ్దానికి కళ్ళు తెరచి "రండి. కూర్చోండి దేనికి అప్లికేషనూ" అన్నాడు ఆమెను తినేశాలా మాస్తూ.

ముచ్చెమటలు పట్టాయి మృదులకు. అయినా ధైర్యంగా బి.ఇడి. కాలేజిలో సీటు కోసమండి అంది వినయంగా.

అలాగా ఇలా వచ్చి కూర్చోండి. ఏదీ అప్లికేషన్ ఇలా ఇవ్వండి అంటూ "ఆమె చేతివేళ్ళను నొక్కుతూ అప్లికేషన్ చేతిలోకి తీసుకున్నాడు. అతను అప్లికేషన్ మాస్తుండగా తలుపులు మూసుకోవడం గమనించింది మృదుల. సన్నగా వణుకు ప్రారంభమైంది ఆమెలో. అది అటెండర్ పని అని అర్థమయింది. జేబులోంచి పచ్చ ఇంకు పెన్ను తీసి సంతకం చేశాడాయన.

"ఇదిగో అప్లికేషన్ తీసుకో" అన్నాడు విలాసంగా నవ్వుతూ.

"నవ్వుతూ లేచి థ్యాంక్యూసర్. ఒకసందేహమండీ" అంది వినయంగా.

"ఏమిటీ" అంటూ నిదానంగా ఆమె దగ్గరగా వచ్చాడు. "నాకు కొంత కాలం క్రితం 'లెప్రసీ' వచ్చిందండీ. ఇప్పుడు తగ్గిపోయింది లెండి. కాని అప్పుడు ఈ వేలు మొండిగా అయింది. అది అంత స్పష్టంగా అప్లికేషన్‌లో పేర్కొన వచ్చా" అని అమాయకంగా అడిగింది. ఆఫీసర్ భయంగా ఆ మొండి వేలు వైపు మాశాడు. వెంటనే కంగారుగా రెండడుగులు వెనక్కు వేశాడు ఆయన. "ఏ, ఏ, ఏమో. ఆ విషయం నాకు తెలియదు. ఎవర్నైనా కనుక్కో" అని కంపంగా అంటూ "రంగయ్యా ఈమెను బయటకు పంపు స్టాంపు వేసి" అని ఇందాక ఆమెను ముట్టుకున్న చేతిని వాష్ బేసిన్ వద్దకు వెళ్ళి కడుక్కోసాగాడు.

ప్రశ్నార్థకంగా తలుపు తీసి, స్టాంపు వేసి ఆయన వంకా, చురుగ్గా నడుస్తూ వెడుతున్న మృదుల వంకా వింతగా మాస్తుండిపోయాడు రంగయ్య.

అతన్ని పట్టించుకోకుండా ఆఫీసు మెట్లు దిగి "డియర్ ఆఫీసర్ లెప్రసీ వంటి చర్మ వ్యాధికి 'మల్టీ డ్రగ్ చికిత్స' మందయితే నీలాంటి మానసిక వ్యాధికి నా అబద్ధమే సరైన మందు అనుకొని పిండి బొబ్బుతుంటే నలిగిన చేతి వేలును ముద్దు పెట్టుకుని పోస్టాఫీసు వైపు నడిచింది తన అప్లికేషన్ పోస్టు చేయడానికి.

**